

ఏయూలో గోల్‌మాల్

- గత నాలుగేళ్లుగా ఓఎంఆర్ షీట్, బుక్‌లెట్‌ల కొనుగోళ్లలో అక్రమాలు
- అస్మదీయులకు కాంట్రాక్టు
- 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనంగా రూ.2 కోట్లు చెల్లింపు
- స్టేషనరీ, వైట్ పేపర్ వ్యవహారంలోనూ అదేతంతు

-7లో



బొత్స ఎంపికపై గరంగరం

స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పొరుగు జిల్లా నేతను ఎంపిక చేయడంపై ఉమ్మడి జిల్లా వైసీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఖరారు చేయడంపై వైసీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ బయటకు వెళ్లిపోవడంతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానం కోసం ఎంతోమంది కాచుకు కూర్చున్నారు. సాధారణ ఎన్నికల్లో అవకాశం కల్పించలేకపోయిన వారికి ఇస్తారని కోలా గురువులు వంటి నాయకులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఊహించని విధంగా పార్టీ అభ్యర్థులంతా ఓడిపోవడంతో అందరి కళ్లు శాసన మండలిపై పడ్డాయి. ఎలాగైనా అధికారంలో కొనసాగాలనే తాపత్రయంతో మొన్నటివరకు అధికారం అనుభవించిన వారంతా ఈ ఎమ్మెల్సీ టికెట్‌ను ఆశించారు. కానీ ఊహించని విధంగా పక్క జిల్లా నాయకుడు బొత్సను అభ్యర్థిగా ప్రకటించడంతో అంతా కంగుతిన్నారు.

- పక్క జిల్లా నాయకుడిని తీసుకువచ్చి పోటీ చేయించాల్సిన అవసరమేమిటంటూ ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో నాయకులే లేరా...అంటూ ప్రశ్నలు
- మొన్న ఆయన భార్యకు ఎంపీ సీటు... ఇప్పుడు ఆయనకు ఎమ్మెల్సీ సీటు
- ఎన్నిక అనివార్యమైతే బొత్స విజయం కోసం ఎంతమంది మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే...

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను పోటీకి దింపుతున్నట్టు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఇటీవల సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులతో అమరావతిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రాయాలు తెలుకున్నాక, బొత్సను అభ్యర్థిగా ఖరారు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతా నవ్వు ముఖాలు పెట్టినా లోలోపల మాత్రం కుతకుతలాడిపోతున్నారు. పొరుగు జిల్లాకు చెందిన నాయకుడిని తీసుకువచ్చి ఇక్కడ పోటీకి దింపడం ఏమిటంటూ రుసరుసలాడుతున్నారు. అసలు...ఈ టికెట్ బొత్సకు ఇస్తారని ఎవరూ ఊహించలేదు. ఆయన పోటీలో ఉన్నారనే విషయం కూడా ఎక్కడా బయటకు పొక్కలేదు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో ఓట్లు వేసేది ఉమ్మడి విశాఖ జిల్లాలోని స్థానిక సంస్థల ప్రతినిధులు మాత్రమే. అన్ని పార్టీలకు కలిపి మొత్తం 822 మంది ఉన్నారు. రెండున్నరేళ్ల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు రెండు స్థానాలకు వైసీపీ తరపున వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణిలను పోటీకి దింపారు. అప్పుడు కూడా కళ్యాణి అభ్యర్థిత్వంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆమెకు ఇక్కడ ఎలా అవకాశం ఇస్తారని ప్రశ్నించారు. అంతకు ముందు ఎన్నికల్లో ఆమె అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీ తరపున పనిచేశారని పార్టీ సర్ది చెప్పింది. దాంతో నాయకులు సరిపెట్టుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే కోటా సీటు ఖాళీ అయితే జిల్లాలో నాయకులు ఎంతోమంది ఉండగా...పొరుగు జిల్లాకు చెందిన బొత్సను ఎంపిక చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కూడా విశాఖ ఎంపీగా బొత్స భార్య ఝాన్సీలక్ష్మిని పోటీకి దింపారు. అప్పుడు ఎవరూ పెద్దగా బాధ పడలేదు. ఎవరికీ ఎంపీగా పోటీ చేసే ఆలోచన, అంత మొత్తం ఖర్చు పెట్టే స్థోమత లేకపోవడంతో మిన్నకున్నారు. ఏమి చేసినా తాము ప్రశ్నించలేమనే ధీమాతోనే అధిష్ఠానం ఇప్పుడు బొత్సను ఎంపిక చేసిందని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఆశావాహులు ఎంతోమంది...

ఉమ్మడి విశాఖ జిల్లాలోని వైసీపీలో అనేక మంది సీనియర్ నాయకులు ఉన్నారు. తాజా మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్‌లు ఈ ఎమ్మెల్సీ సీటును బలంగా కోరుకున్నారు. అలాగే ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా పోటీ చూసి ఊహించని విధంగా క్రాస్ ఓటింగ్ వల్ల ఓడిపోయిన మత్స్యకార నాయకుడు కోలా గురువులు కూడా ఈ సీటు తనకే వస్తుందని భావించారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే అనకాపల్లి ... మిగతా 8వ పేజీలో

రైలు ప్రయాణికుల కష్టాలు

ఎనిమిది నెలలుగా తిప్పలు

- గంటల తరబడి ప్లాట్‌ఫారాలపై నిరీక్షణ
- కొనసాగుతున్న రైళ్ల రద్దు
- ట్రాక్ పనుల కోసమే అంటున్న అధికారులు



ప్లాట్‌ఫారంపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2:

అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల కష్టాలు తీరడం లేదు. రైళ్ల రద్దు కొనసాగడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. గంటల తరబడి ప్లాట్‌ఫారాలపై నిరీక్షణ చేయాల్సి వస్తోంది. గత ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

అనకాపల్లి రైల్వే ప్రయాణికులు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, రాయగడ, మచిలీపట్నం-విశాఖ, రాజమండ్రి-విశాఖ రైళ్లపై అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రైళ్లు జూన్ 23వ తేదీ నుంచి రద్దయ్యాయి. అంతకు ముందు కూడా ఈ రైళ్లు రద్దయినప్పటికీ అడపాదడపా మధ్యలో అందుబాటులోకి తీసుకువచ్చారు. సుమారు ఎనిమిది నెలలుగా ఈ రైళ్ల పరిస్థితి ఇదేవిధంగా ఉండడంతో ఇటు విశాఖ, విజయనగరం-రాయగడ, అటు తుని, అన్నవరం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరుకు ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. రైళ్లు రద్దు కావడం వల్ల అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు దాదాపుగా రోజుకి రూ.లక్ష వరకు ఆదాయం తగ్గినట్టు తెలుస్తోంది. సామాన్య ప్రయాణికులకు విజయవాడ వైపు వెళ్లే రైళ్లల్లో సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఉదయం ఎనిమిది గంటలకు అందుబాటులో ఉండేది. అయితే ఈ రైలు ప్రస్తుతం రద్దు జాబితాలో ఉండడంతో ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం. జన్మభూమి తరువాత విజయవాడ వైపు ప్రయాణం సాగించాలంటే ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో ధన్‌బాద్ నుంచి అలెప్పీ వెళ్లే బొకారో ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. అయితే ఈ రైలు అనకాపల్లికి వచ్చేసరికి జనరల్ బోగీలు కిటకిటలాడుతుంటాయి. రైలు ఎక్కేందుకు అవకాశం కూడా ఉండదు. మరో రైలు లేక ఈ రైలులో ఒంటి కాలిపై నిలబడి వెళ్లక తప్పడం లేదని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. అలాగే ఉదయం ఎనిమిదిన్నర గంటల తరువాత తిరుమల అందుబాటులోకి వస్తుంది. ఈ రైలు ఎప్పుడూ ఆలస్యంగానే వస్తుంది. కాకినాడ తరువాత సామాన్య ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లు రద్దీగా ఉండడంతో అనకాపల్లి నుంచి ప్రయాణం సాగించే ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయం పది గంటల సమయంలో విశాఖ నుంచి విజయవాడకు పాసింజర్ రైలు సామాన్య ప్రయాణికులకు అందుబాటులో ఉండేది. అయితే ఈ రైలు నిలిపివేసి చాలా కాలమైంది. ఆ రైలు స్థానంలో మరో రైలు అందుబాటులో లేకపోవడంతో బొకారో వెళ్లిన తరువాత విజయవాడ వైపు వెళ్లడానికి మధ్యాహ్నం వరకు ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై రైళ్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దు జాబితాలో ఉన్న రైళ్లను పునరుద్ధరించి తాము గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై శుక్రవారం అనకాపల్లి వచ్చిన దక్షిణ మధ్య రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. రాజమండ్రి, కడియం ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ భద్రతా చర్యలు జరుగుతున్నాయన్నారు. ఈ పనులు ఈనెల పదో తేదీకి పూర్తవుతాయని, తరువాత నుంచి రైళ్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.



ఖాళీగా ఉన్న రెండో నంబరు ప్లాట్‌ఫారం

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

పోలీసు తనిఖీల్లో 246 కిలోల గంజాయి స్వాధీనం : ఎస్పీ దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పోలీసు తనిఖీల్లో రావికమతం పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.12.3 లక్షల విలువ చేసే 246 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. పాసింజరు వాహనం, ఆటో, మోటారు సైకిల్, మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని పట్టుకున్న రావికమతం పోలీసులను ఎస్పీ దీపిక అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ అప్పలరాజు, కె.కోటపాడు ఇన్‌స్పెక్టర్ స్వామినాయుడు, కొత్తకోట సీఐ అప్పలనాయుడు, చీడికాడ, బుచ్చెయ్యపేట ఎస్ఐలు ధనుంజయనాయుడు, డి.ఈశ్వరరావు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సందిగ్ధంలో తహసీల్దార్ల బదిలీలు

మండలాల కేటాయింపులో అనిశ్చితి

- అడ్డంకిగా మారిన ఎన్నికల కోడ్
- ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసిన ప్రభుత్వం
- ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత?
- పోస్టుల కోసం ఎదురు చూస్తున్న తహసీల్దార్లు



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తహసీల్దార్ల బదిలీల వ్యవహారం సందిగ్ధంలో పడింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన 24 మంది తహసీల్దార్లను సొంత జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీరికి కలెక్టరు మండలాలు కేటాయించాల్సి వుంది. గత శనివారం 24 మంది తహసీల్దార్లు కలెక్టరు విజయకృష్ణన్‌కు రిపోర్టు చేశారు. ఇంతలో ప్రభుత్వం తహసీల్దార్లకు గతంలో పనిచేసిన డివిజన్‌లు, మండలాలు కేటాయించవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లాకు బదిలీపై వచ్చిన 24 మంది తహసీల్దార్లకు మండలాలు కేటాయించలేదు. ఇది జరిగి వారం రోజులు కావస్తున్నా భూపరిపాలన విభాగం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాకపోవడంతో బదిలీల ప్రక్రియ ముందుకు సాగలేదు. జిల్లాకు కేటాయించిన 24 మందిలో కొందరు తహసీల్దార్లు తమకు విశాఖపట్నం బదిలీ చేయాలని కోరుతున్నట్టు సమాచారం. విశాఖపట్నం జిల్లాలో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ ఇప్పటికే పూర్తయినా.. వాటిని రద్దు చేసి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల వారీగా తహసీల్దార్ల బదిలీలు నిర్వహించే యోచనలో అధికారులు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో తహసీల్దార్ల బదిలీలకు కోడ్ వర్తిస్తుందని, బదిలీలు మరికొద్ది రోజులు ఆలస్యం కానుందని అధికారులు చెబుతున్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఎన్నికల కోడ్ కొనసాగుతుందని, ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖలో కీలకంగా వ్యవహరించే తహసీల్దార్ల నియామకాలు ఆలస్యం అయితే పరిపాలనా పరమైన ఇబ్బందులు తప్పవని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు కాకముందే బదిలీల ఉత్తర్వులు జారీ అయినందున తహసీల్దార్లకు మండలాలు కేటాయించేందుకు వెసులుబాటు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్టు తెలిసింది. దీనిపై ఎన్నికల కమిషన్ నుంచి ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత రాగానే తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ జరపనున్నారు. తహసీల్దార్ల బదిలీలు, మండలాల కేటాయింపుల విషయంలో జరుగుతున్న ఆలస్యంపై కలెక్టర్ విజయకృష్ణన్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. భూపరిపాలన విభాగం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 24 మందికి మండలాల కేటాయింపులు జరుపుతామన్నారు.

లేటరైట్ తవ్వకాలపై ప్రభుత్వం ఆరా

లీజుదారుల వెనుక ఉన్నదెవరు?

- భమిడికలొద్ది క్వారీపై నివేదిక సమర్పించాల్సిందిగా గనుల శాఖకు ఆదేశాలు
- ఎన్జీటీ తీర్పు వివరాలను బయటపెట్టకపోవడంతో అధికారుల తీరుపై అనుమానాలు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సరుగుడు, సుందరకోట పంచాయతీల పరిధిలో వైసీపీ హయాంలో చేపట్టిన లేటరైట్ తవ్వకాలపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. గత ఏడాది డిసెంబరులో సుందరకోట పంచాయతీ తొరడ గ్రామ పరిధిలో రెండు క్వారీలకు అనుమతులు ఇవ్వడంపై వివరాలు కోరింది. శోభా సత్యసాగర్, శోభా అప్పలరాజు అనే ఇద్దరు గిరిజనుల పేరిట వైసీపీకి చెందిన ఒక కార్పొరేషన్ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ప్రాంతానికి చెందిన వడ్డీ వ్యాపారి కలిసి క్వారీలు తీసుకున్నారని, వారి వెనుక నర్సీపట్నానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఇచ్చిన లీజులపై నర్సీపట్నం గనుల శాఖ సహాయ సంచాలకుల నుంచి ప్రభుత్వం పూర్తి వివరాలు కోరినట్టు తెలిసింది. దీంతో గనుల శాఖ అధికారులు ఇటీవల తొరడ గ్రామంలో లేటరైట్ ఉన్న కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే సరుగుడు పంచాయతీలో సుమారు పదేళ్ల క్రితం సింగం భవానీ పేరిట రెండుచోట్ల తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. అక్కడ అనేక అక్రమాలు చోటుచేసుకోవడంలో చాలాకాలం క్రితమే తవ్వకాలు నిలిపివేశారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జర్తా లక్ష్మణరావు పేరిట ఆ పార్టీకి చెందిన కీలక నేత కుమారుడు ... మిగతా 8వ పేజీలో

పేటలో ఆక్రమణలు

- మెయిన్ రోడ్డుపై ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు
- ఇరుకుగా మారిన రహదారి
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- కనిపించని ప్రభుత్వ కార్యాలయాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట ఏర్పాటుచేసిన షాపులు

పాయకరావుపేట, ఆగస్టు 2 :


పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఆక్రమణల తొలగింపుపై అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఆక్రమణల కారణంగా రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పట్టించుకోవడం లేదు. మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల లోపలకు వెళ్లేందుకు దారి ఉంచి మిగతా ప్రాంతమంతా ఆక్రమణల పాలవుతోంది.

పట్టణంలో తాండవ వంతెన నుంచి వై.జంక్షన్ వరకు రెండు కిలోమీటర్లు మెయిన్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి షెడ్లు, నిర్మాణాలు చేపట్టడంతో 100 అడుగులు ఉండాల్సిన మెయిన్‌రోడ్డు ఇరుకుగా మారి, నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. మెయిన్ రోడ్డు విస్తరణ జరిగితే ఆక్రమణలు తొలగించడం జరుగుతుందని దశాబ్దకాలంగా చెబుతున్నా ఇప్పటివరకు కార్యరూపం దాల్చడం లేదు. గతేడాది అప్పటి వైసీపీ ప్రభుత్వం మెయిన్‌రోడ్డును విస్తరణ లేకుండా ఉన్న రోడ్డును అభివృద్ధి చేసింది. దీంతో మెయిన్‌రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు ఇప్పట్లో జరగదని భావించిన కొంతమంది ఆక్రమించిన స్థలాల్లో పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలో పీహెచ్‌సీ, విద్యుత్ సబ్ స్టేషన్, పీఆర్ గెస్టుహౌస్, ప్రభుత్వ పాఠశాల, పాత పంచాయతీ కార్యాలయం తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాల లోపలికి వెళ్లేందుకు దారి మాత్రమే విడిచిపెట్టి మిగిలిన స్థలాన్ని పూర్తిగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసేశారు. దీంతో పట్టణ ప్రజలకు వైద్య సేవలందించే పీహెచ్‌సీకి వెళ్లాలంటే ఎక్కడో వెతుక్కోవలసిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఆసుపత్రి ప్రహరీని ఆనుకుని అనుమతుల్లేకుండా ఏర్పాటుచేసిన దుకాణాలకు చెందిన విద్యుత్ వైర్లు ఆసుపత్రి లోపలికి వెళ్లే దారిలో వేలాడుతుండడంతో ... మిగతా 8వ పేజీలో

పింఛన్ల పంపిణీలో జిల్లాకు ప్రథమ స్థానం

జిల్లాలో 99.44 శాతం పంపిణీ

- ఉద్యోగులకు కలెక్టర్ అభినందనలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వెంకట శ్రీరామూర్తికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

అనకాపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లాకు రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కింది. రాష్ట్ర స్థాయిలో పింఛన్ల పంపిణీలో 99.44 శాతం నమోదు చేసి జిల్లా అగ్రపథంలో నిలిచింది. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో జిల్లాలోని ఉద్యోగులు గురు, శుక్ర వారాల్లో సమర్థవంతంగా పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు దక్కింది. జిల్లాలో 2,62,624 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులు ఉండగా శుక్రవారం సాయంత్రానికి 2,61,114 మందికి పంపిణీ చేసి 99.44 శాతం నమోదు చేశారు. స్వల్ప శాతం తేడాతో కర్నూల్ ద్వితీయ, నంద్యాల తృతీయ స్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో ప్రథమ స్థానం రావడానికి కారకులైన ఉద్యోగులందరికీ కలెక్టర్ విజయకృష్ణన్ అభినందనలు తెలిపారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- నగరం నుంచి చోడవరం మిల్లులకు తరలిస్తుండగా పట్టుకున్న టాస్క్‌ఫోర్స్
- నగరంలో మూడుచోట్ల పౌర సరఫరాల శాఖ దాడులు
- అక్కయ్యపాలెం డిపోపై కేసు నమోదు

విశాఖపట్నం, ఆగస్టు 2:
నగరంలోని అక్కయ్యపాలెం నుంచి అనకాపల్లి జిల్లా చోడవరంలోని మిల్లులకు అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారు జామున ఎన్ఏడీ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెంలో రేషన్ డిపోల్లో నిల్వ చేసిన బియ్యాన్ని మూడు ఆటోల్లో చోడవరం తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అక్కయ్యపాలెంలోని డిపో నంబరు-2పై పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి రిజిస్టర్‌లో పేర్కొన్న సరకు కంటే 274 కిలోలు అదనంగా ఉన్నట్టు నిర్ధారించారు. దీంతో డిపోకు కేటాయించిన సరకు మొత్తం సీజ్ చేసి డిపో నంబరు-3కు అప్పగించారు. డిపో నంబరు-2పై 6-ఎ కేసు నమోదుచేశారు. కాగా పరదేశిపాలెం, రైల్వేన్యూ కాలనీలో వేర్వేరుగా దాడులు చేసి 970 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నగరంలో అక్రమంగా బియ్యం వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు హెచ్చరించారు.

పచ్చని చెట్లు కూల్చేశారు

- రాయపుర అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నేరేడు, వేప, అకేషియా చెట్లు నరికి, ముక్కలుగా కోత
- పిల్లలపై పడిపోతాయనే ఇలా చేశామని సర్పంచ్, స్కూల్ కమిటీ చైర్మన్ చెప్పినట్టు హెచ్ఎం వివరణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంఈవో



రాయపుర అగ్రహారం పాఠశాల ఆవరణలో నరికివేసిన చెట్లు

సబ్బవరం, ఆగస్టు 2: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా ఉన్న నేరేడు, వేప, అకేషియా చెట్లను కొంతమంది యంత్రాలతో కూల్చివేశారు. అంతేకాకుండా ముక్కలు ముక్కలుగా కోసేశారు. దీనిపై స్థానికులు అందించిన సమాచారం మేరకు శుక్రవారం విలేకరులు సదరు పాఠశాలకు వెళ్లి పరిశీలించగా, కూల్చేసిన చెట్లు దర్శన మిచ్చాయి. దీనిపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బి.వెంకటరెడ్డిని వివరణ కోరగా, గత మంగళవారం పాఠశాల సమయం తరువాత మండల కేంద్రం సబ్బవరంలో ఆర్‌జేడీ సమావేశానికి హాజరయ్యాయని తెలిపారు. ఆ సాయంత్రం పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లు కూల్చివేశారన్నారు. సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ పిల్లల సాధుబాబు తామే చెట్లు కూల్చివేసినట్టు చెప్పారన్నారు. పిల్లలపై కూలిపోతాయన్న భయంతో ఇలా చేసినట్టు వివరించారని తెలిపారు. ఈ విషయాన్ని ఎంఈవో లక్ష్మణరావు దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. విలేకరులు ఆయనను వివరణ కోరగా, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా విలువైన నేరేడు, వేప, అకేషియా చెట్లను సర్పంచ్, స్కూల్ కమిటీ చైర్మన్ అమ్మేసుకునేందుకే నరికేశారని పలువురు గ్రామస్థులు ఆరోపించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత

బుచ్చెయ్యపేట, ఆగస్టు 2: వివిధ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న పింఛనుదారులకు సైతం సచివాలయాల ఉద్యోగులు నగదు పంపిణీ చేశారు. కేజీహెచ్, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొలేపల్లికి చెందిన సీతా వెంకట శ్రీరామమూర్తి, యండపల్లి కన్నయ్యమ్మ, కాళ్ల గణేష్మ్మ, మూర్తి రమణ, మల్లోత్రి మాణిక్యం తదితరులకు శుక్రవారం పింఛన్ నగదు పంపిణీ చేశారు. మొత్తం 99 శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో వెంకటాచార్యులు తెలిపారు.

నిండు గర్భిణికి తప్పని డోలి మోత

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణిని సుమారుగా రెండు కిలోమీటర్లు డోలిలో మోయాల్సిన ఘటన మండలంలో ఇరడాపల్లి పంచాయతీ డి.సంపాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. డి.సంపాల గ్రామానికి చెందిన గర్భిణి పాంగి చినతల్లికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. రోడ్డు సదుపాయం లేకపోవడంతో కుటుంబీకులు ఆమెను డోలిలో సుమారు రెండు కిలోమీటర్లు మోసుకుని వంజంగి గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి 108 వాహనంలో ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలోని వైద్యుల పర్యవేక్షణలో ఆమె సురక్షితంగా ఉన్నారు.



గర్భిణి చినతల్లిని డోలిలో మోసుకువస్తున్న గిరిజనులు

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

విశాఖపట్నం, ఆగస్టు 2: వివిధ జోన్‌ల పరిధిలో నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

రద్దైన రైళ్ల వివరాలు

నాగపూర్ డివిజన్‌లో నాన్ ఇంటర్ లాక్ నిర్మాణ పనుల కారణంగా ఈనెల 14న గాంధీధాం-పూరి ఎక్స్‌ప్రెస్ (22973), ఈనెల 17న పూరి-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (22974) రైళ్లను రద్దు చేశారు. సాంకేతిక కారణాలతో హౌరా-యశ్వంత్‌పూర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (02863) రైలును ఈనెల 8, 15వ తేదీల్లో రద్దు చేశామన్నారు.

మళ్లింపు మార్గంలో నడిచే రైళ్లు

సాలెం డివిజన్‌లో భద్రత, ఆధునికీకరణ పనుల నేపథ్యంలో అలెప్పీ-ధనబాద్ ఎక్స్‌ప్రెస్ (13352) ఈనెల 8,10, 13, 15, 17, 20, 22, 24, 27, 29 తేదీల్లో వయా పొదునూర్, ఇరుగూర్, సూరత్కల్ మీదుగా....ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18190) ఈనెల 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29 తేదీల్లో వయా పొదునూర్, కోయంబత్తూర్, ఇరుగూర్ మీదుగా నడుస్తాయి. విశాఖ-నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ ఈనెల 6, 10, 11, 13, 14, 15, 18 తేదీల్లో వయా విజయవాడ, బల్లార్ష, నాగపూర్ మీదుగా, తిరుగు ప్రయాణంలోని నిజాముద్దీన్-విశాఖ (12808) సమతా ఎక్స్‌ప్రెస్ ఈనెల 8, 12, 13, 15, 16, 17, 20 తేదీల్లో నాగపూర్, బల్లార్ష, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847) ఈనెల 18న విజయవాడ, బల్లార్ష, వర్ధా, భూసావల్ మీదుగా తిరుగు ప్రయాణంలోని ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22848) ఈనెల 20, భూసావల్, వర్ధా బల్లార్ష, విజయవాడ మీదుగా నడుస్తాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	80.00
లైవ్ ధర	100.00
విత్ స్కిన్	170.00
స్కిన్ లెస్	180.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

ఏయూలో గోల్‌మాల్

ప్రస్తుత పాలకులు విచారణ జరిపించాలంటూ సర్వత్రా డిమాండ్

- ఓఎంఆర్ షీట్, బుక్‌లెట్‌ల కొనుగోళ్లలో అక్రమాలు
- అస్మదీయులకు కాంట్రాక్టు.. అదనంగా రూ.2 కోట్ల చెల్లింపు
- స్టేషనరీ, వైట్ పేపర్ వ్యవహారంలోనూ అదేతంతు
- తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్న
- కాంట్రాక్టర్‌ను పక్కనపెట్టి నేరుగా వ్యవహారం

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):
ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. గత పాలకులు వర్సిటీ నిధులను ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తాజాగా అటువంటి వ్యవహారం మరొకటి వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీలో ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేయించిన గత పాలకులు వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్స్, బుక్ లెట్స్‌ను బయట నుంచి కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వినిపస్తున్నాయి.

ఏటా వర్సిటీలో పరీక్షల నిర్వహణకు సుమారు 20 నుంచి 25 లక్షల వరకు ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు అవసరమవుతాయి. ఇందుకు వర్సిటీ రెండు కోట్ల నుంచి రూ.2.5 కోట్లు చెల్లిస్తుంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదనంగా మరో రెండు కోట్ల రూపాయలు చెల్లించినట్టు తెలిసింది. ఓఎంఆర్ షీట్లు స్కానింగ్ చేయడంతోపాటు దానికి బుక్ లెట్ స్టిచింగ్ చేసినందుకు ఈ అదనపు మొత్తాన్ని చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ చెల్లింపు వెనుక పెద్ద తతంగమే నడిచింది. ఇదిలావుంటే ఈ ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్స్ సరఫరా చేసే కాంట్రాక్టును కూడా గత పాలకులు తమకు అస్మదీయులైన వారికి కట్టబెట్టినట్టు చెబుతున్నారు. గతంలో వర్సిటీలో ఉన్నతాధికారికి ఆత్మీయుడైన వ్యక్తికి ఈ కాంట్రాక్టును అప్పగించారు. దీనిపై ప్రస్తుత వీసీ పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

టెండర్ లేకుండా కొనుగోలు..

యూనివర్సిటీకి స్టేషనరీ, వైట్ పేపర్ సరఫరా చేసేందుకు టెండర్లు పిలుస్తుంటారు. గత వీసీ బాధ్యతలు చేపట్టిన తరువాత 2020లో టెండర్ పిలిచారు. ఈ టెండర్‌లో గడిచిన 30 ఏళ్లుగా వర్సిటీకి స్టేషనరీ, తెల్ల కాగితాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ తక్కువకు కోట్ చేసి టెండర్ దక్కించుకున్నారు. రూ.15 లక్షలు విలువజేసే పెన్నులు, జిరాక్స్ పేపర్లు వంటి స్టేషనరీ, మరో 180 టన్నులు వైట్ పేపర్ సరఫరా చేయడానికి కాంట్రాక్టర్ ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, ఈ టెండర్‌ను పక్కనపెట్టిన వర్సిటీ అధికారులు తమకు కావాల్సిన వ్యక్తి నుంచి వీటిని నేరుగా కొనుగోలు చేశారు. అలాగే, పేపర్ వాల్యుయేషన్ సమయంలో ప్రొఫెసర్లకు క్లాత్ లైన్ కవర్లు ఇస్తుంటారు. ఏటా సుమారు 50 వేల వరకు క్లాత్ లైన్ కవర్లు అవసరం అవుతాయి. వీటిని కూడా టెండర్లు లేకుండానే నాటి అధికారులకు కావాల్సిన వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. గడిచిన నాలుగేళ్లుగా వీటిని టెండర్లు లేకుండానే కొనుగోలు చేస్తుండడం వెనుకున్న మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రింటింగ్ ప్రెస్ ఎందుకు మూసివేసినట్టో..?

ఏయూలో ఏళ్ల తరబడి ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ను గత పాలకులు మూసివేశారు. దీనికి గల కారణాలను అప్పట్లో చెప్పలేదు. పరికరాలు పాడయ్యాయని, కొనుగోలు చేసేందుకు పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తుందన్న కారణాలను చూపించారు. సుమారు 60 ఏళ్లకు పైబడి చరిత్ర కలిగిన ఈ ప్రెస్‌లోనే వర్సిటీకి కావాల్సిన ఓఎంఆర్ షీట్లు, బుక్‌లెట్లు, దూర విద్యకు సంబంధించి మెటీరియల్‌ను ప్రింట్ చేసేవారు. కానీ, సాంకేతిక ఇబ్బందులు, ఖర్చు పెరుగుతోందన్న కారణాన్ని చూపించి ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేశారు. ఆ తరువాత తమకు కావాల్సిన వారికి కాంట్రాక్టులు అప్పగించుకుని ఇష్టానుసారంగా బిల్లులు చెల్లించినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు. ఈ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసేసిన తరువాత ఇక్కడ పనిచేసే సుమారు 18 మంది టెక్నికల్ సిబ్బందిని ఇతర విభాగాల్లో నాన్ టెక్నికల్ సేవల్లో వినియోగించుకుంటున్నారు.

భయపెడుతున్న తుఫాన్ షెల్టర్

- స్వయంభూవరంలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం
- ప్రస్తుతం శిథిలస్థితికి చేరిక
- ఖాళీ సమయాల్లో పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలు అక్కడే ఆటలు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు హడల్



స్వయంభూవరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న తుఫాన్ షెల్టర్

పరవాడ, ఆగస్టు 2: మండలంలోని కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరంలో గల తుఫాన్ షెల్టర్ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. విపత్తుల సమయంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఈ షెల్టర్ ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. సుమారు నలభై ఏళ్ల క్రితం దీని నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పూర్తిగా శిథిలం కావడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ భవనానికి సంబంధించిన గోడలు సగం వరకు పడిపోయాయి. దీంతో భవనం దుస్థితిని చూసి గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు పాఠశాల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ పిల్లలు ఖాళీ సమయంలో ఈ షెల్టర్ వద్దకు వెళ్లే ఆటలాడుతుంటారు. ఈ సమయంలో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని వారి తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తుఫాన్ షెల్టర్‌ను కూల్చివేయాలని అంతా కోరుతున్నారు.

ఇప్పటికైనా మా గ్రామానికి రోడ్డు వేయండి

- సమస్య చెప్పేందుకే డోలీల్లో వెళ్లి పింఛన్లు తీసుకున్నాం
- అధికారులకు కొరుప్రోలు గ్రామ గిరిజనుల వినతి



డీఆర్‌డీఏ పీడీ శచీదేవికి రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

రోలుగుంట, ఆగస్టు 2: తమ గ్రామానికి రహదారి సౌకర్యం కలగా మిగిలిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఎంకే పట్నం పంచాయతీ పరిధిలోని కొరుప్రోలు గ్రామ గిరిజనులు కోరారు. ఈ గ్రామానికి చెందిన వారు డోలీలపై గురువారం ఎం.కె. పట్నం వచ్చి పింఛన్లు అందుకున్నారంటూ మీడియాలో కథనాలు రావడంతో శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, తహసీల్దార్ సోమశేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు తదితరులు ఈ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కొరుప్రోలు గిరిజనులు ఇన్నాళ్లూ తమ గ్రామానికి రోడ్డు లేక అవస్థలు పడుతూ వచ్చామన్నారు. అందుకే తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి ఎలాగైనా తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో పింఛన్లు అందుకునేందుకు డోలీలపై వెళ్లినట్టు చెప్పారు. తమ గ్రామానికి ఇప్పుడైనా అధికారులు రావడం ఆనందంగా ఉందన్నారు.

ఈ విధంగా తమ సమస్యను గుర్తించాలన్నారు. కేవలం ద్విచక్ర వాహనం మాత్రమే వచ్చే అవకాశం ఉన్న తమ గ్రామానికి రోడ్డు వేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గత ఐదేళ్లలో కూడా తమ గ్రామానికి పింఛన్లు ఇవ్వడానికి ఎవరూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామానికి రోడ్డు వేయాలని పీడీకి వినతిపత్రం అందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై మాజీ మంత్రుల సమీక్ష

- హాజరైన బొత్స, బూడి తదితరులు



వైసీపీ నాయకులతో సమాలోచనలు చేస్తున్న మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు

నక్కపల్లి, ఆగస్టు 2: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ఖరారైందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నక్కపల్లిలో వైసీపీ నాయకులతో మాజీ మంత్రులు సమాలోచనలు జరిపారు. మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇక్కడికి విచ్చేశారు. వైసీపీ నేత వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు తదితరులు వారికి స్వాగతం పలికారు. అనంతరం మండలంలో, నియోజకవర్గంలో వైసీపీ తరపున ఎంపీటీసీ సభ్యులు ఎంత మంది ఉన్నారు.. ? తదితర అంశాలపై వీసం రామకృష్ణతో చర్చించారు. మళ్లీ మూడు రోజుల్లో నక్కపల్లి వచ్చి అందరితో మాట్లాడతానని బొత్స చెప్పారు. అయితే ఆయన విలేకర్లతో మాట్లాడడానికి నిరాకరించారు. ధర్మం నాలుగుపాదాల నడుస్తుందంటారా.. ? అని బొత్స విలేకర్లను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, స్థానిక నాయకులు కొల్లాటి బుజ్జి, అల్లాడ కొండ, బంగార్రాజు, తళ్లా భార్గవ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో వరి సాగు

డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు



నాతవరంలో డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు వేస్తున్న దృశ్యం

నాతవరం, ఆగస్టు 2: మండల కేంద్రం నాతవరంలో కొందరు రైతులు వరిసాగును ఆధునిక పద్ధతుల్లో చేస్తున్నారు. డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు వేస్తున్నారు. డ్రమ్‌సీటర్ ద్వారా ఎకరానికి సన్నరకం వరి విత్తనాలు 12 కిలోలు, ముద్దక రకం వరి విత్తనాలు ఎకరానికి 14 కిలోల వరి విత్తనాలు సరిపోతాయని రైతులు చెబుతున్నారు. ఈ విధానం ద్వారా వరిసాగు చేయడం వల్ల ఆకుపోత, ఆకుతీత పనులు ఉండవని, అలాగే కూలీల కొరత కొంత మేర తగ్గుతుందని రైతులు తెలిపారు. ఈ విధానం వల్ల ఎకరానికి రూ.5 వేలు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని చెప్పారు. దమ్ముపట్టి వరినాట్లు వేసి వ్యవసాయం చేస్తే ఎకరానికి ఈ ప్రాంతంలో 25 బస్తాలకు మించి రావడం లేదని, అదే డ్రమ్‌సీటర్ ద్వారా వరినాట్లు వేసి వ్యవసాయం చేస్తే ఎకరానికి 32 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది చాలా మంది రైతులు ఈ విధానంలోనే వరినాట్లు వేసి సాగు చేస్తున్నారు.

సభాపతిని కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసి బార్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సీపట్నం, ఆగస్టు 2: బార్ అసోసియేషన్ ప్రతినిధులు సభాపతి అయ్యన్నపాత్రుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గంజాయి కేసులకు ప్రత్యేకంగాకోర్టు ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయిలో బెంచ్ ఏర్పాటు, కోర్టు సముదాయం విస్తరణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టా ప్రభాకర్, కార్యదర్శి అనిమిరెడ్డి శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కోసూరి అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు కామిరెడ్డి సత్యనారాయణ, అప్పలనాయుడు, పొక్కునూరి నర్సింహం, లోకా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి, కార్యదర్శి జి.మురళీకృష్ణ సభాపతి అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నంలో గ్రంథాలయ సంస్థకు చెందిన స్థలంలో భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని కోరారు.

రైల్వే స్టేషన్లను సందర్శించిన ఏడీఆర్ఎం

- అధికారులకు పలు సూచనలు



అనకాపల్లి స్టేషన్‌లో పట్టాలను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 : ఇక్కడి రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆయన అనకాపల్లికి సమీపంలోని తాడి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం మధ్యాహ్నం అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. ముందుగా రైల్వే ట్రాక్, ప్లాట్‌ఫారాలను పరిశీలించి స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అమృత్ భారత్ పథకంలో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు వేగవంతం చేస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రైల్వే ట్రాక్ పటిష్టత పనులు జరుగుతున్నందున పలు రైళ్లు నిలిచినట్టు చెప్పారు. ఈ నెల పదో తేదీ తరువాత ప్రయాణికులకు ఆయా రైళ్లు అందుబాటులోకి రానున్నట్టు వివరించారు. ఆయన వెంట ఎస్ఎస్‌తో పాటు పలు విభాగాల అధికారులు ఉన్నారు.

రైవాడ జలాశయం నుంచి 150 క్యూసెక్కుల నీరు విడుదల



రైవాడ నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్న అధికారులు

దేవరాపల్లి, ఆగస్టు 2: రైవాడ జలాశయం నుంచి ఆయకట్టు భూములకు ఎడమ, కుడి కాలువల నుంచి 150 క్యూసెక్కులు నీటిని శుక్రవారం విడుదల చేశారు. ఖరీఫ్ వరినాట్లు వేయడానికి జలాశయం పరిధిలో ఉన్న 15,344 ఎకరాల ఆయకట్టుకు ఎడమ కాలువ నుంచి 100 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి ఏభై క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి, నీటి సంఘం ప్రతినిధులు, రైతులతో సమావేశమయ్యారు. రైతుల కోరిన విధంగా నీటిని విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, పూడి నారాయణమూర్తి, గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, లెక్కల అవతారమూర్తి, రెడ్డి బలరాం, పోతలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అటల్ మారథాన్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయాధికారిణి రూపావతి

సబ్బవరం, ఆగస్టు 2: జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అటల్ మారథాన్ 2023-24లో సబ్బవరం గురుకుల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులు జె.సందీప్, ఎల్.మున్నా, గైడ్ టి.రాంబాబులను ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయాధికారిణి రూపావతి శుక్రవారం ఇక్కడ అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ ఎంపిక చేసిన టాప్ 500 ప్రాజెక్టులలో తమ విద్యార్థులు రూపొందించిన నగరాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి డ్రైనేజ్ క్లీనింగ్ సిస్టమ్ ప్రాజెక్టు టాప్ 100లో ఎంపికైనట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 వేల మంది విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, ఉపాధ్యాయులు జానకీరామ్, చిరంజీవిరావు, ప్రభాకరరావు, తిరుపతిరావు, ఐసాక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పాఠశాలల్లో ఎన్నికలు

▸▸ హెచ్ఎంల సమావేశంలో డిప్యూటీ డీఈవో అప్పారావు


ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నక్కపల్లి, ఆగస్టు 2 : ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల ఎనిమిదో తేదీన జరగనున్న పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని పలు పాఠశాలల హెచ్ఎంలతో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యుల చొప్పున ఎన్నుకోవాల్సి ఉంటుందని వివరించారు. జనరల్ కేటగిరీ, బలహీన వర్గాలకు చెందినవారు కూడా సభ్యులుగా వుండాలన్నారు. ఎనిమిదో తేదీన జరిగే ఎన్నికలకు 50 శాతం తల్లిదండ్రులు , లేదా సంరక్షకులు హాజరు కావల్సిఉందన్నారు. నోటిమాట లేదా రహస్య బ్యాలెట్ లేదా చేతులు ఎత్తడంవంటి ప్రక్రియల ద్వారా ఎన్నికలు జరిపించాలన సూచించారు. తల్లిదండ్రుల్లో ఒక్కరికి మాత్రమే ఓటు హక్కు ఉంటుం దని వివరించారు. ఎంఈవో కె.నరేశ్, హెచ్ఎంలు వేమగిరి నూకరాజు, రాణీలలిత, నారాయణరావు, డి.సత్యారావు,అప్పలరాజు, సుందరరావు, చోడిశెట్టి సత్యనారాయణ, త్రినాథరావు, కవిత పాల్గొన్నారు.

ఆధునిక సాగు విధానంపై అవగాహన అవసరం

▸▸ జిల్లా వ్యవసాయాధికారి రామ్మోహన్‌రావు


పొలం బడి కో-ఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

సబ్బవరం, ఆగస్టు 2 : ఆధునిక సాగు విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జి.రామ్మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఇక్కడ పొలం బడి కో-ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జాగృతి ఎండీ సుజాత మాట్లాడుతూ రైతు సంఘాల సభ్యులకు జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో మౌక్తిక, అనకాపల్లి, చోడవరం, పరవాడ, ఎలమంచిలి, పాయకరావుపేట మండలాల వ్యవసాయాధికారులు, పలువురు రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలపై రైతులకు అవగాహన


వరి పొలంలో సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నక్కపల్లి, ఆగస్టు 2 : ఉద్దండపురంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగుపై ఏవో ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వరి సాగుకు సంబంధించి రైతులతో మాట్లాడారు. నారు మండి నుంచి పంట కోత వరకూ పాటించాల్సిన మెలకువలు, విత్తనశుద్ధి, కలుపు యాజమాన్యం, సమగ్ర చీడ పీడల యాజమాన్యం, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్ వివరించారు. సబ్ డివిజన్ మండల ఏవోలు రాకేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాడు అవగాహన లోపం.. నేడు చెట్లకు శాపం


విద్యుత్ సిబ్బంది తొలగించిన చెట్టు కొమ్మ

ఎలమంచిలి, ఆగస్టు 2 : మునిసిపల్, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయ లోపం కారణంగా పట్టణంలో పలుచోట్ల పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. చెట్లకొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను అడ్డగోలుగా నరికివేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేసేందుకు విద్యుత్ వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియను ఆశాఖ అధికారులు చేపట్టారు. అయితే ప్రధాన రోడ్డు వెంబడి చెట్ల కొమ్మలను పెద్దస్థాయిలో నరికివేశారని పర్యా వరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది సంవత్సరాల క్రితం మునిసిపాలిటీ భారీగా ఖర్చు చేసి ఏకకాలంలో మొక్కలను నాటారు. కాలక్రమేణా అవి పెద్దవయ్యాయి. నేడు వైర్ల కింద అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. పదేళ్ల క్రితం విద్యుత్ వైర్ల లైన్ల కింద మొక్కలను నాటడం వల్లే ఈ సమస్య తలెత్తిందని వాపోతున్నారు. మునిసిపల్, విద్యుత్ అధికారుల మధ్య సమన్వయఉంటే నేడు ఇలా జరిగేది కాదని పలువురు అంటున్నారు.

'పేట'లో ఆక్రమణలు

... 5వ పేజీ తరువాయి

పెద్ద వాహనాలు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. విచిత్రమేమిటంటే.. పాత పంచాయతీ కార్యాలయం ఎదుట కూడా ఆక్రమణలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. భవిష్యత్తులో పాత పంచాయతీ కార్యాలయం లోపలకు వెళ్లే దారి మూసుకుపోయినా ఆశ్చర్యపడక్కల్లేదు. రాజకీయ నాయకుల అండతోనే పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పలువురు షెడ్లు ఏర్పాటుచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణలపై ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు.

లేటరైట్ తవ్వకాలపై ప్రభుత్వం ఆరా

... 5వ పేజీ తరువాయి

భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలు చేపట్టారు. లేటరైట్ రవాణా కోసం అటవీ శాఖ భూముల్లో రోడ్డు నిర్మించారు. ఇందుకోసం వందలాది చెట్లు కొట్టేశారు. భమిడికలొద్దిలో అసలు ఎంత మేర పర్మిట్లు తీసుకున్నారు?, ఎంత లేటరైట్ తవ్వారు?...అనే దానిపై గనుల శాఖ అధికారులు గోప్యత పాటించారు. నాతవరం మండలానికి చెందిన మరిడయ్య నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయడంతో భమిడికలొద్దిలో ఏడాదిన్నర క్రితం తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే పర్యావరణానికి సంబంధించి ఎన్జీటీ ఇచ్చిన తీర్పు వివరాలను మాత్రం గనుల శాఖ ఇప్పటికీ బయటకు వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో భమిడికలొద్దిలో లేటరైట్ తవ్వకాలపై కూడా సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు రహస్యంగా ఉంచారు. దీంతో వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బొత్స ఎంపికపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

జిల్లాలో కరణం ధర్మశ్రీ రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. భీమిలి నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌టీ సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్, పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని కోటవురట్ల మండలంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యానారాయణరాజు, గాజువాక నియోజకవర్గంలో చింతలపూడి వెంకట్రామయ్య, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన కేకే రాజు...ఇలా పార్టీలో చాలా మంది ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. కానీ వీరందరినీ కాదని పక్క జిల్లా విజయనగరానికి చెందిన బొత్సను తీసుకువచ్చి అభ్యర్థిగా ప్రకటించారు. ఇది విశాఖ జిల్లా నాయకులను అవమానించినట్టేనని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విజయనగరం జిల్లాలో పదవులన్నీ బొత్స కుటుంబానికే కట్టబెట్టారని, పార్టీ ఓడిపోయిన తరువాత కూడా ఆ కుటుంబం హవానే సాగాలనే ధోరణి అధిష్ఠానంలో కనిపిస్తున్నదని, అయితే అది ఆ జిల్లాకే పరిమితమైతే బాగుండేదని, పొరుగు జిల్లాకు తీసుకువచ్చి ఆయన నాయకత్వాన్ని రుద్దడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంతమంది పార్టీ అభ్యర్థి విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే.

పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలపై సమీక్ష

▸▸ కూటమి నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్న ఎమ్మెల్యే 'కొణతాల'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఆగస్టు 2 : పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికల ప్రక్రియపై పట్టణంలోని రింగు రోడ్డులో గల జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం కూటమి నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఉన్న ముఖ్యనేతల నుంచి పలు అభిప్రాయాలను సేకరించారు. అనంతరం పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించే దిశగా పని చేయాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు భరత్‌బాబు, గొంతిన శ్రీనివాసరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి గోపీ, కాండ్రేగుల సతీష్, బుదిరెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో పూర్తిస్థాయిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ కోరుతూ వినతి


ఎమ్మెల్యే సుందరపుకు వినతిని అందించిన ప్రతినిధులు

ఎలమంచిలి, ఆగస్టు 2 : నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించేలా కృషి చేయాలని కోరుతూ డైలీ ప్యాసింజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు స్థానిక నాయకులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ ఆయనను కలిసి తమ సమస్యలు విన్నవించారు. నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా పూర్తిస్థాయిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ లేకపోయిందని వాపోయారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, కూటమి నాయకులు లవుడు లోవరాజు, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ, కరణం రవి, నక్కా శివశంకర్, మడగల సత్యనారాయణ, గుర్రాల శేఖర్, డైలీ ప్యాసింజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'దుర్గునాయుడు వీధిలో లోవోల్టేజీ సమస్య'

కొత్తూరు, ఆగస్టు 2 : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం దుర్గునాయుడు వీధి పరిసర ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి లో వోల్టేజీ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కరించాలని సదరు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ శ్రీనివాసరావు, బీశెట్టి సుధ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి మద్దతుదారుల గెలుపే లక్ష్యం కావాలి'


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టిబాబు

పాయకరావుపేట, ఆగస్టు 2 : పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికల్లో కూటమి పార్టీలు మద్దతిచ్చే అభ్యర్థుల గెలుపునకు అంతా కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడి కార్యాలయంలో ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల ఎనిమిదో తేదీన జరగనున్న ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారులను గెలిపించుకుంటే రానున్న రోజుల్లో హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో అయా పాఠశాలలను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, మజ్జూరి నారాయణరావు, కురందాసు శివ, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, పెదిరెడ్డి పండు తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ భూములు పరిశీలించిన అధికారులు

రైతుల పరిహారం అంశం వివరించిన నేతలు


కారిడార్ భూములను పరిశీలిస్తున్న అధికారుల బృందం

నక్కపల్లి, ఆగస్టు 2: విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ నక్కపల్లి మండలంలో సేకరించిన భూములను శుక్రవారం అధికారుల బృందం పరిశీలించింది. నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఏపీఐఐసీ అధికారులతో కలిసి కారిడార్‌లో పరిశ్రమల ఏర్పాటు నిమిత్తం నిర్మించనున్న సబ్ స్టేషన్‌కు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. భూములిచ్చిన రైతుల్లో ఇంకా కొంతమందికి పరిహారం అందలేదని, వారికి న్యాయం చేయాలని టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ కోరారు. రైతులకు న్యాయం చేసి, పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నగిరెడ్డి సత్యనారాయణ, సర్వేయర్ మూర్తి, ఏపీఐఐసీ అధికారులు, రైతులు గంటా నర్సింగరావు, నూరకాసుల గోవింద్, అయినంపూడి అప్పలరాజు పాల్గొన్నారు.

పైడమ్మ చెరువుపై ఆధారపడిన వారికి న్యాయం చేయాలి


కార్యాలయ అధికారిని వినతిని అందిస్తున్న గ్రామ పెద్దలు

రాంబిల్లి, ఆగస్టు 2 : వాడనర్సాపురం గ్రామ సమీపంలోని పైడమ్మ చెరువు విషయంపై గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పెద్దలు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎన్ఏవోబీ పరిధిలోని పైడమ్మ చెరువులో గత నలభై సంవత్సరాలుగా చేపల వేట, పాడిపశువుల మేత వంటి వాటి ద్వారా గ్రామస్థులు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇప్పటికే సదరు రైతులను గుర్తించినా వారికి నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయంలో వారికి న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శారదా నదిలో ఘాట్ ఆక్రమణపై ఫిర్యాదు

కొత్తూరు, ఆగస్టు 2 : పట్టణంలోని శారదా నది వద్ద ఉన్న వినాయక ఘాట్‌పై ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన వాటిని తొలగించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. శారదానదిలో ఏడాదిలో ఆరు నెలల పాటు నిమజ్జనోత్సవాలు జరుగుతుంటాయన్నారు. నదివద్ద వినాయక ఘాట్ ప్లాట్‌ఫారంపై ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు స్పందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కమిటీ సభ్యులు దాడి బుజ్జి, కొణతాల హరినాథ్‌బాబు, సోమశేఖర్ పట్నాయక్, కొడుకుల శ్రీకాంత్, చంద్రం తదితరులు ఉన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పెదబోదిగల్లం పాఠశాలలో పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళి

నక్కపల్లి, ఆగస్టు 2 : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సీహెచ్.సత్యనారాయణ, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరంలో పింగళి వెంకయ్య చేసిన కృషిని హెచ్ఎం వివరించారు. ఉపాధ్యాయులు ఫాల్గుణరావు, కుమారి, చిన్నారావు, ఆచార్యులు, రమేశ్‌బాబు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


ఎస్.రాయవరం : ధర్మవరం అగ్రహారంలో

కొత్తూరు : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకయ్య జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్. రాయవరం : మండలంలోని పాఠశాలల్లో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని జరిపారు. ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పింగళి వెంకయ్య జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిష్పత్తి ప్రకారమే టీచర్ల సర్దుబాటు


ఎంఈవోలకు వినతి పత్రం అందిస్తున్న ప్రతినిధులు

కోటవురట్ల, ఆగస్టు 2 : పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి ఆధారంగానే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జవ్వాది నర్సింగరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ ఎంఈవోలు రామారావు, జోషిలకు వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాలల పనివేళల్లో ఉపాధ్యాయులను కార్యాలయ పనులకు ఉపయోగించరాదన్నారు. విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే విషయంలో అందరితో చర్చించి ఒక నిర్ణయానికి రావాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, ప్రతినిధులు జేవీ ప్రసాద్, లోవరాజు, చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం


సమావేశంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి

కొత్తూరు, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆరుగళ్ల కొండబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా సుమారు 59 ఉప కులాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీల్లో అన్ని ఉపకులాలకు న్యాయం జరగాలన్న ప్రధాని మోదీ కృషి ఫలితంగానే నేడు ఇది సాకారమైందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు కార్పెట్ల బహూకరణ

నక్కపల్లి, ఆగస్టు 2 : రాజయ్యపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పిక్కి స్వామి తనవంతుగా కార్పెట్లను బహూకరించారు. హెచ్ఎం నారాయణరావు, టీచర్ డీవీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కశింకోట, ఆగస్టు 2 : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. గురువారం తమకు అందిన సమాచారం మేరకు కశింకోట శివారు రైల్వే గేటు వద్ద తనిఖీలు చేపట్టామన్నారు. ఇంతలో గోనె సంచితో వెళ్తున్న బయ్యవరం గ్రామానికి చెందిన దిశెట్టి లోవరాజును అదుపులోకి తీసు కుని చూడగా, అందులో ఎనిమిది మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నట్టు చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 : పట్టణంలోని దాసరిగెడ్డ రోడ్డులో గల సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలతో పాటు, ఏకాహం నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం


ఆసుపత్రి ప్రాంగణంలో మొక్క నాటుతున్న ప్రతినిధులు

కశింకోట, ఆగస్టు 2 : మండలంలోని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు డాక్టర్ అరుణ్ కాదంబ్, డాక్టర్ మితిలేష్ సొంబర్ ఆసుపత్రిలో ఉన్న మందులు, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద, వైద్య సిబ్బంది సత్యనారాయణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తొలగించాలి

ఎస్. రాయవరం, ఆగస్టు 2 : పంట కాలువల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం, ఎలమంచిలి మండలం ఏటికొప్పాక, పద్మనాభరాజుపేట రెవెన్యూ పరిధిలో ఉన్న మిరాసి పంట కాలువను శుక్రవారం పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరాసి పంట కాలువ తుప్పలు, డొంకలతో నిండి ఉండడంతో సాగునీరు ప్రవహించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ కారణంగా రైతుల పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొందని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి పూడికను తొలగించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ఎం.రాజేశ్, ఎస్.గోవిందరావు, కె.రమణ, కె.బాబూరావు లోవరాజు, సాయి పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు


చోడవరం రోడ్డులో వర్షపునీరు తొలగింపు దృశ్యం

కొత్తూరు, ఆగస్టు 2 : నిత్యం రద్దీగా ఉండే రహదారులు దెబ్బతినడంతో వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ.30లక్షల నిధులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంజూరు చేశారు. అనకాపల్లి- చోడవరం, అనకాపల్లి- విశాఖపట్నం రోడ్లను అధికారులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు కొణతాలను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన తక్షణమే పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశామని, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని వారికి సూచించారు. ఇదిలావుంటే, చోడవరం వెళ్లే మార్గంలో నిలిచిపోయిన నీటిని తొలగించే పనులను జనసేన పార్టీ నాయకులు చేపట్టారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు


మాట్లాడుతున్న రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రాజేంద్రప్రసాద్

సబ్బవరం, ఆగస్టు 2 : ఉపాధి హామీలో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.14 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులపై మండలంలోని 24 పంచాయతీల పరిధిలో శనివారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆ పథకం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డి.రాజేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి పథ కం సిబ్బంది, అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడారు. తొమ్మిది మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు, విలేజ్ రిసోర్స్ పర్సన్లతో కలిసి సామాజిక తనిఖీల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ముందుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం అందించి సామాజిక తనిఖీ చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో రామ్మోహన్‌రావు, ఏవో బాబూరావు, ఏఈలు మల్లు నాయుడు, అర్జునఅప్పారావు, ఏపీవో శ్రీనివాసరావు, ఈఏ పరమేశ్ పాల్గొన్నారు.

లెప్రసీ రోగుల గుర్తింపు సర్వేను పరిశీలించిన రాష్ట్ర బృందం


పీహెచ్‌సీలో రోగుల వివరాలపై ఆరా తీస్తున్న జేడీ డాక్టర్ దేవర తదితరులు

సబ్బవరం, ఆగస్టు 2 : ఇక్కడి ఎహెచ్‌సీలో శుక్రవారం డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన లెప్రసీ కేస్ డిడక్షన్ క్యాంపెయిన్‌ను రాష్ట్ర బృందం పరిశీలించింది. లెప్రసీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.దేవర, స్టేట్ లెప్రసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సత్యవతి, లెప్రసీ ఎన్జీవో స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రియదర్శిని, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎంవీఎస్ బాలాజీ రోగులకు సంబంధించిన రికార్డులను పరిశీలిం చారు. పాత కేసులు, సస్పెక్టెడ్ కేసుల వివరాలపై ఆరాతీశారు. అంతకు ముందు సర్వే జరుగుతున్న గ్రామాలను సందర్శించి లెప్రసీ రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి, డాక్టర్ బి.ఆశ, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్ఈవో జేసుదాసు, రత్నాబాయి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేతకు రంగం సిద్ధం?

- పోలీసులు, సరంజామా సిద్ధం చేసిన మునిసిపల్ అధికారులు
- మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత రాకతో ఉత్కంఠ


వైసీపీ నేతకు చెందిన షాపు


ఘటనా స్థలం వద్దకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేతలు

నర్సీపట్నం, ఆగస్టు 2 : నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నాయకుడు నిర్మించిన ఓ దుకాణం కూల్చివేతకు అధికారులు చర్యకు దిగుతున్నట్టు విస్తృతంగా ప్రచారం కావడంతో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్, వైసీపీ నేతలు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అయితే మునిసిపల్ అధికారులు దుకాణం కూల్చివేతపై ఎలాంటి చర్య తీసుకోకపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాలిలా ఉన్నాయి.

స్థానిక గచ్చపువీధికి చెందిన వైసీపీ నాయకుడు చిటికెల కరుణాకరరావు పాల డెయిరీ దుకాణం కూల్చి వేస్తున్నారని శుక్రవారం విస్తృత ప్రచారం జరిగింది. మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా షాపు నిర్మించినట్టు ఆరోపణలు ఉన్నాయి. మూడు నెలల నుంచి ఈ దుకాణం కూల్చివేతపై చర్చ జరుగుతూనే ఉంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయాన్నే నర్సీపట్నం సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సైలు, సిబ్బంది, ప్రత్యేక పోలీసు బలగాలు పట్టణ పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నారు. మరోవైపు వేకువజామున ఐదు గంటలకే మాజీ ఎమ్మెల్యే గణేశ్, కార్యకర్తలతో అక్కడకు చేరుకున్నారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, వైసీపీ నాయకులు కూడా అక్కడకు చేరుకోవడంతో ఏం జరుగుతుందోనన్న కొంత ఉద్రిక్తత నెలకొంది. అయితే చివరకు మునిసిపల్ అధికారులను అడిగితే కూల్చివేత వంటిది ఏమీ లేదని సమాధానం చెప్పారు. మునిసిపల్ కమిషనర్ రవిబాబును అడగ్గా ఈ దుకాణం విషయమై ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఎలాంటి చర్యలైనా చట్ట ప్రకారమే తీసుకుంటామన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ విలేకరులతో మాట్లాడుతూ కరుణాకరరావు షాపు కూల్చి వేస్తున్నారని తెలిసి ఇక్కడకు తామంతా వచ్చామన్నారు. అలాంటి నిర్ణయం ఏదైనా తీసుకుంటే అది ముమ్మాటికీ తప్పిదమే అవుతుందన్నారు.

కాలువలో పూడిక తొలగించిన రైతులు


పూడిక తొలగిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, ఆగస్టు 2 : మండలంలోని గిడుతూరు గ్రామంలో రైతుల సాయంతో సాగునీటి కాలువలో పూడిక తీశారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువల్లో గ్రోయిన్లకు మరమ్మతు చేపట్టకపోవడంతో పూడిక పేరుకుపోయి రైతులకు ఇబ్బంది కలిగింది. ఈ నేపథ్యంలో గిడుతూరు గ్రామానికి చెందిన రైతులు గత ఐదేళ్ల నుంచి చక్కలయ్య చెరువు నుంచి సాగునీరు అందేలా కాలువలో పూడిక తీసుకొంటున్నారు. ఈ ఏడాది బుచ్చిరాంప్రసాద్‌తో పాటు మరికొంతమంది ఆయకట్టు రైతులు సుమారు లక్ష రూపాయలు పోగుచేసి పూడిక తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరినాట్లు వేసే సమయంలో చెరువులో నీరు ఉన్నప్పటికీ కాలువలో నిండా పూడిక వల్ల నీరు పొలాలకు చేరడం లేదని తెలిపారు. అందుకే తామే పూడిక తీసే చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరినాట్లు వేసేందుకు నీటిని అందించేందుకు కాలువ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

దాతల సహకారంతో రోడ్డుపై గోతులు పూడ్చివేత


కృష్ణాదేవిపేట-నర్సీపట్నం మార్గంలో గోతులు పూడ్చుతున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఆగస్టు 2 : కృష్ణాదేవిపేట-నర్సీపట్నం మార్గంలో లింగంపేట, రామచంద్రపురం గ్రామాల వద్ద గల తారురోడ్డుపై భారీ గోతులను దాతల సహకారంతో ఎట్టకేలకు పూడ్చారు. గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం లింగంపేట, గుజ్జుమన్నపాకల, రామచంద్రపురం జంక్షన్ వద్ద కొన్నేళ్ల నుంచి ఉన్న భారీ గోతులను క్వారీ పిక్క, బూడిదతో వేసి పూడ్చివేతకు చర్యలు తీసుకున్నారు.ఈ మార్గం గోతులమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పాక్షికంగానైనా పూడ్చడంతో కొంత ఊరట కలుగుతుందని అంటున్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

చీడికాడ, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై చీడికాడ మండలంలో పలువురు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చీడికాడ, జైతవరం గ్రామాల్లో మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు రావాడ దేముడుబాబు, మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సంఘం చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి ఖండెల్లి వెంకటరావు, రెల్లిహక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు యర్రంశెట్టి వరప్రసాద్, చీడికాడ ఎంపీటీసీ రావాడ మణితో పాటు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం

మాడుగుల రూరల్ : ముప్పై ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎస్సీ ఉపకులాల రెల్లి కులస్థులు బొమ్మాల పోలరాజు, శుభాకర్, మణికంఠ, వెంకట్రావు, సంజీవరావు అన్నారు. రెల్లి కులస్థులకు ఒక శాతం ఇవ్వడంతో విద్యా,ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని హర్షం వ్యక్తం చేశారు.

లేటరైట్ తవ్వకాలపై ప్రభుత్వం ఆరా

... 5వ పేజీ తరువాయి

భమిడికలొద్దిలో 121 హెక్టార్లలో లేటరైట్ తవ్వకాలు చేపట్టారు. లేటరైట్ రవాణా కోసం అటవీ శాఖ భూముల్లో రోడ్డు నిర్మించారు. ఇందుకోసం వందలాది చెట్లు కొట్టేశారు. భమిడికలొద్దిలో అసలు ఎంత మేర పర్మిట్లు తీసుకున్నారు?, ఎంత లేటరైట్ తవ్వారు?...అనే దానిపై గనుల శాఖ అధికారులు గోప్యత పాటించారు. నాతవరం మండలానికి చెందిన మరిడయ్య నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయడంతో భమిడికలొద్దిలో ఏడాదిన్నర క్రితం తవ్వకాలు నిలిచిపోయాయి. అయితే పర్యావరణానికి సంబంధించి ఎన్జీటీ ఇచ్చిన తీర్పు వివరాలను మాత్రం గనుల శాఖ ఇప్పటికీ బయటకు వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో భమిడికలొద్దిలో లేటరైట్ తవ్వకాలపై కూడా సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు రహస్యంగా ఉంచారు. దీంతో వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

మండల సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, ఆగస్టు 2 : ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారం చూపడం ద్వారా ప్రణాళికబద్ధంగా అభివృద్ధికి కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చింతలబుల్లి లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ప్రగతిపథంలో నడిచేందుకు రైతుల సహకారం అవసరమన్నారు. ఏ పంచాయతీలో భవనాలు లేవో వివరాలు ఇవ్వాలన్నారు. పాఠశాల భవనాలు ఖాళీగా ఉన్నట్టయితే వాటిలో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలనిఆదేశించారు. గృహ నిర్మాణ శాఖపై చర్చించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. సచివాలయం సిబ్బంది సేవలు క్షేత్ర స్థాయిలో కూడా వినియోగించుకోవాలని సూచించారు.

ఉద్యానవన శాఖ సేవలు తమ గ్రామానికి ఇప్పటి వరకు అందడం లేదని బి.కింతాడ సర్పంచ్ బూరే బాబూరావు అన్నారు. కాశీపురం, ఎ.కొత్తపల్లిలో సంపద కేంద్రాలకు ముందుగా బిల్లులు చెల్లించినప్పటికీ నిర్మాణాలు పూర్తి చేయలేదని ఆదిరెడ్డి వరలక్ష్మి, చింతలవెంకటరమణ పేర్కొన్నారు.

కలిగొట్ల పాఠశాలకు వెళ్లే మార్గం లేక శ్మశాన వాటికను ఆనుకొని వెళ్లడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నామని బ్రిడ్జి నుంచి రహదారి ఏర్పాటు చేయాలని సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి కోరారు. రైవాడ, ఎం.అమండ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు లేవని, రైవాడ జాశయంలో పేరుకుపోయిన తుప్పలను తొలగించాలని సర్పంచ్ చల్లాలక్ష్మి, జగన్ సభ దృష్టికి తీసుకు వచ్చారు. డ్రైనేజీలు ముందు నిర్మించి, ఆ తరువాత రోడ్లు వేయాలని మండల ఇంజనీర్ ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆ భూములపై హక్కు మాదే..

- రెవెన్యూ అధికారులకు ఏఎల్‌పురం, కొంగిసింగి గ్రామల రైతుల వినతి


ఆర్‌ఐకు వినతపత్రం అందజేస్తున్న రైతులు

గొలుగొండ/ కృష్ణాదేవిపేట, ఆగస్టు 2 : మూడు దశాబ్దాలుగా తాము సాగు చేస్తున్న భూములను లాక్కోవడానికి కొందరు తగాదాలకు దిగుతున్నారని, ఈ విషయంలో న్యాయం తమ పక్కనే ఉందని తమకు న్యాయం చేయాలని కోరుతూ గొలుగొండ రెవెన్యూ అధికారులకు ఏఎల్‌పురం, కొంగిసింగికి చెందిన పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆర్‌ఐ నాగరాజుకు వినతిపత్రంఅందజేశారు. అనంతరం వారు విలేకరులతో తమసమస్యను వివరించారు.

1994లో ఏఎల్‌పురం గ్రామ వాసి చింతల అచ్చియ్యనాయుడుకు చెందిన 15 ఎకరాల భూమిని ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. అప్పట్లో పాతకృష్ణాదేవిపేటకు చెందిన 30 మందికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసినా అప్పగించలేదు. అయితే అప్పటికే ఆ భూమిలో గత కొన్నేళ్ల నుంచి కొంగసింగి, ఏఎల్‌పురం గ్రామానికి చెందిన శెట్టి కన్నయ్యనాయుడు, మల్లు సీతారామయ్య, లోకారపు తలుపులు, అప్పలనాయుడు, సాంబమూర్తి తదితర ఏడుగురు రైతులు సాగు చేసుకుంటూ ఉన్నారు. అయితే ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ భూమిగా పరిగణనలోకి తీసుకోవడంతో, అప్పటికే సాగు చేస్తున్న రైతులు హైకోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు.

ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాల మేరకు అప్పటి నర్సీపట్నం ఆర్డీవో 145 నోటీసు విడుదల చేశారు. ఇదివరకే ఆ భూమిలో సాగు చేస్తున్న రైతులే అర్హులుగా నిర్ధారించారు. కానీ ఇప్పుడు ఆ భూములు తమవి అంటూ అప్పట్లో పట్టాలు పొందిన కొందరు వస్తున్నారని సాగు రైతులు తెలిపారు. నిజానికి ఆ భూమిపై హక్కులు తమవని చెప్పారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బండారు

కె.కోటపాడు, ఆగస్టు 2 : కె.కోటపాడు మండలంలోని కింతాడ పంచాయతీ శివారు రావాలమ్మపాలెంలో జూలై 27న వరి పొలాల్లో దమ్ము చేస్తుండగా జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన బండారు శివ సన్యాసయ్యపాత్రుడు (శివ) కుటుంబసభ్యులను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం పరామర్శించారు. కింతాడలో మృతుడు శివ భార్య చంద్రకళ, కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పరామర్శించి ఓదార్చారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సబ్బవరపు రామునాయుడు తదితరులు ఉన్నారు.

పలు ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు


నాతవరంలో తల్లిపాల వారోత్సవాలు


మాకవరపాలెం : మాట్లాడుతున్న సూపర్‌వైజర్

నాతవరం, ఆగస్టు 2 : బిడ్డకు కచ్చితంగా తల్లిపాలనే ఇవ్వాలని, అప్పుడే ఆ బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం నాతవరంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యం గురించి వివరించారు. అనంతరం తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.నాగజ్యోతి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.నూకరత్నం, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం : పుట్టిన బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ మానసిక వికాసం సాధ్యమని గిడుతూరు క్లస్టరు సూపర్ వైజర్ రమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం గిడుతూరు క్లస్టరు పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్ మండల అధ్యక్షుడు ధనమ్మ, వైద్య సిబ్బంది,అంగన్ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని వడ్డాది, మంగళాపురం, లోపూడి, బంగారుమెట్ట తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లల బరువు, ఎత్తు, కొలతలు వేశారు. ఈ కార్యక్రమంలో జి.అమ్మాజీ, రాధా, సాయిలక్ష్మి, కె.వరలక్ష్మి, కనకలక్ష్మి, సూర్యకుమారి, శనివాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేట : వడ్డాదిలో అవగాహన కలిగిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

పారిశుధ్య నిర్వహణ, పాలిథిన్ నిషేధంపై ప్రత్యేక దృష్టి

- మునిసిపల్ కమిషనర్ రవిబాబు


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం, ఆగస్టు 2 : మునిసిపాలిటీలో పారిశుధ్యం, పాలిథిన్ నిషేధంపై దృష్టి పెట్టాలని కమిషనర్ పూడి రవిబాబు అన్నారు. శుక్రవారం సచివాలయం శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, ఇన్‌స్పెకర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. శానిటరీ సెక్రటరీలు వార్డుల్లో తిరిగి డ్రైనేజీలు, పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మునిసిపల్ కార్యాలయం, ఉద్యోగులు, సిబ్బంది నుంచి పాలిథిన్ కవర్ల నిషేధం మొదలు కావాలని పిలుపునిచ్చారు. ఇకపై మునిసిపల్ సిబ్బంది ఎవరూ పాలిథిన్ కవర్లు వాడకూడదని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా 120 మైక్రాన్లు కంటే తక్కువ నాణ్యత ఉంటే కేసులు రాసి అపరాధ రుసుం వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు శుభపరిణామం

- సుప్రీంకోర్టు తీరుపై ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎలకా మల్లిబాబు



చోడవరం, ఆగస్టు 2 : సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఇంతకాలం అన్యాయానికి గురవుతున్న ఎస్సీ ఉపకులాలకు మేలు చేకూరినట్టయిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఎలకా మల్లిబాబు పేర్కొన్నా రు ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ సాగించిన అవిశ్రాంత పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో చక్కని ఫలితం దక్కినట్టయిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం దేశంలోనే మద్దతు ప్రకటించిన సీఎం చంద్రబాబు అధికారంలో ఉండగానే సుప్రీంకోర్టు తీర్పు రావడం శుభపరిణామన్నారు. చంద్రబాబు హయాంలోనే వర్గీకరణ ఫలితాలు తమకు అందే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నేతల హర్షం


కాగా సుప్రీంకోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్ నేతలు స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్, ఎమ్మార్పీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు, మోర్తా శ్రీనివాసరావు, కండెలి వెంకటరావు, వరప్రసాద్, రెల్లి సంఘం జిల్లా నాయకులు పొట్నూరి అప్పారావు, ప్రదీప్, ఎలకా రాజు, అప్పారావు, యువకులు పాల్గొన్నారు.

సరైన సస్యరక్షణతో అధిక దిగుబడులు


సూచనలు ఇస్తున్న ఏవో విజయలక్ష్మి

రోలుగుంట, ఆగస్టు 2 : రైతులు ఉత్తమ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అడ్డసరంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం పొలాల్లో రైతులు నాటు వేసుకునే సమయంలో ముందుగా సూడోమోనస్ నీటి ద్రావణంలో ఆకు వేర్లు ముంచి 1 గంట సేపు ఉంచి నాటడం వలన తెగుళ్ల నుంచి రక్షణ కలుగుతుందన్నారు.

రావికమతం : ఖరీఫ్ వరి సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి డి.రూప పేర్కొన్నారు. మండలంలోని గుడివాడలో శక్రవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. దమ్ము సమయంలో వాడే ఎరువులు, మందులు అధికారుల సూచన మేరకే వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు మాధురి, కొండమ్మ, వ్యవసాయ సిబ్బంది, రైతులు రాపర్తి అప్పలగణేశ్, రమణపాల్గొన్నారు.


మాకవరంపాలెంలోని గుడివాడలో పొలంబడి

పాడి రైతులకు విశాఖ డెయిరీ ప్రోత్సాహకాల కుదింపు అన్యాయం

- ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముత్యాలనాయుడు

కె.కోటపాడు, ఆగస్టు 2 : విశాఖ డెయిరీ పాడి రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను క్రమేపీ తగ్గిస్తుండటంపై ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు ఒక ప్రకటనలో మండిపడ్డా రు. పాడి రైతులకు ఇచ్చే బోనస్ గత సంవత్సరం నుంచి నిలుపుచేయడమే కాకుండా పాల రైతులకు ఇచ్చే బీమా కూడా తగ్గించుకుంటూ వస్తున్నారని ఆరోపించారు. పాల సరఫరాతో సంబంధం లేకుండా ప్రతి పాడి రైతు 60 ఏళ్ల పైబడిన వారు చనిపోతే రూ.30 వేలు ఆకుటుంబానికి ఇచ్చేవారని, ప్రస్తుతం నిబంధనలు మార్చి, ఏప్రిల్ 1 నుంచి ప్రతి పాడి రైతు సంవత్సరానికి 200 లీటర్ల పాలు పోయాలి అన్న నిబంధనలు విధించడం అన్యాయం అన్నారు. అలాంటి రైతు మరణిస్తే వారసులకు కేవలం రూ.మూడు వేలు మాత్రమే అందిస్తున్నారన్నారు. విశాఖ డెయిరీ లాభాల్లో ఉన్నందున ఆ లాభాలను రాజకీయ అవసరాలకు ఉపయోగించకుండా ప్రతి పాడి రైతుల అభ్యున్నతికి వినియోగించాలని డిమాండ్ చేశారు. పాడి రైతుకు ప్రోత్సాహకాలు తగ్గించే బదులు తగ్గిస్తుండడం తగదని ఆయన పేర్కొన్నారు.

బొత్స ఎంపికపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

జిల్లాలో కరణం ధర్మశ్రీ రెండుసార్లు ఎమ్మెల్యేగా చేశారు. విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. భీమిలి నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎస్టీ సామాజిక వర్గం నుంచి మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్, పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని కోటవురట్ల మండలంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యానారాయణరాజు, గాజువాక నియోజక వర్గంలో చింతలపూడి వెంకట్రామయ్య, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయిన కేకే రాజు...ఇలా పార్టీలో చాలా మంది ఎమ్మెల్సీ టికెట్ ఆశించారు. కానీ వీరందరినీ కాదని పక్క జిల్లా విజయనగరానికి చెందిన బొత్సను తీసుకువచ్చి అభ్యర్థిగా ప్రకటించారు. ఇది విశాఖ జిల్లా నాయకులను అవమానించినట్టేనని ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విజయనగరం జిల్లాలో పదవులన్నీ బొత్స కుటుంబానికే కట్టబెట్టారని, పార్టీ ఓడిపోయిన తరువాత కూడా ఆ కుటుంబం హవానే సాగాలనే ధోరణి అధిష్ఠానంలో కనిపిస్తున్నదని, అయితే అది ఆ జిల్లాకే పరిమితమైతే బాగుండేదని, పొరుగు జిల్లాకు తీసుకువచ్చి ఆయన నాయకత్వాన్ని రుద్దడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంతమంది పార్టీ అభ్యర్థి విజయానికి మనస్ఫూర్తిగా పనిచేస్తారనేది అనుమానమే.

‘పేట’లో ఆక్రమణలు

... 5వ పేజీ తరువాయి

పెద్ద వాహనాలు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. విచిత్రమేమిటంటే.. పాత పంచాయతీ కార్యాలయం ఎదుట కూడా ఆక్రమణలు జరుగుతు న్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. భవిష్యత్తులో పాత పంచాయతీ కార్యాలయం లోపలకు వెళ్లే దారి మూసుకుపోయినా ఆశ్చర్యపడక్కర్లేదు. రాజకీయ నాయకుల అండతోనే పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పలువురు షెడ్లు ఏర్పాటుచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణలపై ఆర్ అండ్ బీ, పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

ఎస్‌ఐకి ఎస్పీ ప్రశంసలు



ఎస్‌ఐ ఈశ్వరరావును ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 2 : బుచ్చెయ్యపేట ఎస్‌ఐ డి.ఈశ్వరరావుకు శుక్రవారం తన కార్యాలయంలో ఎస్పీ దీపికా ప్రశంసా పత్రాన్ని అందచేశారు. స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారులను మర్యాదపూర్వకంగా సేవలు అందించడంతో పాటు ఓ గంజాయి కేసును ఛేదించడంతో ప్రతిభ చూపినందుకు ఎస్‌ఐని ఎస్పీ దీపికా అభినందించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావును పలువురు అభినందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం రేపు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 2 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట మరిడిమాంబ ఆలయం వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. ఎముకలు, కళ్లు, ముక్కు, చెవి, గుండె, గైనిక్ వ్యాధులకు సంబంధించి విశాఖపట్నంకు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఏఎల్‌పురం గ్రామ ప్రజలంతా సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

మాడుగుల రూరల్ : మాడుగుల విశాఖ డెయిరీ పాలకేంద్రం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు భారత నిర్మాణ సేవా ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కీళ్ల వ్యాధి నిపుణులు సిస్ట బాలాదిత్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. కీళ్లు, మెడ, దీర్ఘకాలిక నొప్పులు తదితర వాటికి వైద్య సేవలు అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు సభ్యులు తెలిపారు.

ఘనంగా పింగళి జయంతి

నర్సీపట్నం, ఆగస్టు 2 : జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరం చేసుకున్న అదృష్టమన్నారు. జాతిని ఐక్య పరిచే జెండాని రూపొందించే క్రమంలో ఆయన ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ కృష్ణ, అధ్యాపకులు కొండలరావు, డాక్టర్ నారాయణరావు, చక్రవర్తి పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలి ఇప్పించరూ..

నాతవరం, ఆగస్టు 2 : మండలంలో పని చేసే ఉపాధిహామీ కూలీలకు ఏడు వారాల నుంచి వేతనాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై అధికారులను అడిగితే ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే ఇస్తామంటూ చెబుతున్నారని వాపోతున్నారు. కూలి డబ్బులు ఇవ్వకుంటే తమ ఇళ్లు గడిచేది ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు కూలీ డబ్బులు ఇప్పించాలని కోరుతున్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడుగా వెంకటరమణ



బుచ్చెయ్యపేట, ఆగస్టు 2 : వడ్డాది స్టాండ్ కనకదుర్గా ఆటో యూనియన్ అధ్యక్షుడుగా కోవెల వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు వెంకటరమణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 2 : తురకలపూడి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలం సీజన్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టవలసిన ముందస్తు చర్యలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు వేడి చేసి చల్లార్చిన నీటినే సేవించాలన్నారు. చేపలు, నిల్వమాంసం భుజించరాదని సంధ్యారాణి అన్నారు.

అప్పలరాజుపురంలో పరిశుభ్రత


వీధుల్లో పూడిక తరలిస్తున్న దృశ్యం

చీడికాడ, ఆగస్టు 2 : మండలంలోని అప్పలరాజుపురం పంచాయతీలో శుక్రవారం పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక సర్పంచ్ చుక్క అప్పలనాయుడు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ దగ్గర ఉండి కాలువలు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఎక్స్‌కవేటర్‌తో తీయించి తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకి చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు

చీడికాడ, ఆగస్టు 2 : ఆటోలో తరలిస్తున్న 150 గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. ఏజెన్సీ గ్రామాల నుంచి వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని మంచాల శివారులో ఓ ఆటోలో 150 కిలోల గంజాయి పట్టుకున్నట్టు చెప్పారు. ఈ గంజాయి విలువ రూ.7.5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో పాడేరు మండలం కచ్చి గ్రామానికి చెందిన శోభ శ్రీను, వంట్ల మామిడి గ్రామానికి చెందిన వేముల ఈశ్వరరావు, పూలబందకు చెందిన కొర్రా కొండబాబు, అల్లూరి జిల్లా హుకుంపేట మండలం దుర్గం గ్రామానికి చెందిన పాత్రుని దిలీప్‌కుమార్‌లను అరెస్టు చేసి అనకాపల్లి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.